హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టి

- అగనంపూడి ఆస్పత్రిలో స్పెషల్ వార్డు ఏర్పాటు
- 'నాడు–నేడు'తో అదనపు సౌకర్యాలు
- అందుబాటులో వైద్యులు, సిబ్బంది


హై డిపెండెన్సీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి(ఫైల్)


హైరిస్క్ గర్భిణుల కోసం కొత్తగా ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డు

అగనంపూడి: పారిశ్రామిక ప్రాంత పెద్దాస్పత్రిగా పేరొందిన 85వ వార్డు అగనంపూడి ఏరియా ఆస్పత్రి రూపురేఖలు మారుతున్నాయి. నాడు–నేడు కార్యక్రమంలో రూ.17 కోట్లతో ఆస్పత్రిలో ఆధునిక వసతులు, అత్యాధునిక వైద్య పరికరాలు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో విద్య, వైద్య రంగాల్లో వినూత్న మార్పులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో హై డిపెండెన్సీ యూనిట్(హెచ్‌డీయూ) ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక వార్డు హైరిస్క్‌లో ఉన్న గర్భిణులకు వరంగా మారనుంది. ఈ యూనిట్‌ను జూన్ 26న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. దీని ద్వారా హైరిస్క్ గర్భిణులపై వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

ప్రసవ సమయంలో సేవలు

గతంలో హైరిస్క్ ఉన్న గర్భిణులను కేజీహెచ్‌కు పంపించేవారు. ఉమ్మనీరు తక్కువ ఉన్నా, రక్తహీనత కారణంగా తరచూ రిఫరల్ చేసేవారు. కొన్నాళ్ల నుంచి ఇటువంటి పరిస్థితి ఎదుర్కొనే గర్భిణులకు ఇక్కడే వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రసవ సమయంలో గర్భిణులు రక్తహీనత, హైపర్ టెన్షన్, చక్కర వ్యాధి, గుండె కొట్టుకోవడం మందగించడం వంటి సమస్యలు ఉత్పన్నమయ్యే పరిస్థితుల్లో హై డిపెండెన్సీ యూనిట్ ద్వారా సేవలు అందనున్నాయి.


అగనంపూడి ఏరియా ఆస్పత్రి

యూనిట్‌లో సదుపాయాలు

జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌ఎం) నిధులతో ఏర్పాటు చేసిన హెచ్‌డీ యూనిట్‌లో అదనంగా ప్రత్యేక పరుపులు, వసతులు కల్పించారు. యూనిట్‌లో అమర్చిన బెడ్‌లను రిమోట్ కంట్రోల్‌తో ఆపరేట్ చేస్తారు. ఫుట్ ఎలివేషన్, క్రాష్ కాట్, ఆల్ఫా బెడ్‌లు వల్ల మూడు నాలుగు రోజులు గర్భిణులు ఆస్పత్రిలో ఉన్నా.. ఇబ్బందులు తలెత్తకుండా ఇవి ఉపయోగపడతాయి.

స్పెషల్ కేర్.. నిరంతర సేవలు



హెచ్‌డీయూలో చేరిన గర్భిణులకు నిరంతరం వైద్యుల పర్యవేక్షణలో సేవలు అందించే వీలుంటుంది. ప్రత్యేకించి నాలుగు బెడ్‌లు ఏర్పాటు చేశాం. అదనపు సౌకర్యాలు కల్పించాం. అధిక ప్రమాదం, ఇబ్బందులు ఉన్న గర్భిణులకు ఈ యూనిట్ వరం లాంటిది.
– డాక్టర్ ఉష, సూపరింటెండెంట్, అగనంపూడి ఆస్పత్రి

సేవాతత్పరులు వలంటీర్లు

పెదగంట్యాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచింది. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వలంటీర్లు వారధులుగా ఉంటూ సంక్షేమ పథకాల అమలుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు. పారదర్శకంగా ప్రభుత్వ పథకాలను, సేవలను ప్రజలకు చేరవేస్తూ సేవా దృక్పథాన్ని చాటుతున్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు వైఎస్ జగన్ ప్రభుత్వం చేస్తున్న నిరంతర కృషిలో వీరు కీలకంగా వ్యవహరిస్తున్నారు. వలంటీర్ వ్యవస్థ వల్ల ప్రభుత్వానికి మంచి పేరు రావడంతో ప్రతిపక్షాలు ఎన్నో కుట్రలు పన్నుతున్నాయన్న విషయాన్ని ప్రజలు గమనించారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పరిపాలన చరిత్రాత్మకమని లబ్ధిదారులు కొనియాడుతున్నారు.

వలంటీర్లకు వందనం

కష్ట కాలంలో భరోసా..



నాకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పింఛన్ అందుతోంది. ప్రతి నెలా ఒకటో తేదీన కోడి కూయకముందే మా వలంటీర్ తోకల సుజాత ఇంటికి తెచ్చి పెన్షన్ డబ్బులు అందిస్తుంది. అనుకోకుండా ఒకసారి అనారోగ్యంతో కేజీహెచ్‌లో చేరాను. చేతిలో చిల్లి గవ్వ లేదు. అలాంటి కష్ట సమయంలో వలంటీర్ సుజాత ఆస్పత్రికి వచ్చి నాకు పెన్షన్ డబ్బులు అందించింది. వలంటీర్ సేవలకు నా కృతజ్ఞతలు.
– జిత్రిపోతుల రామారావు, స్వతంత్రనగర్

వలంటీర్ సేవలు భేష్..



నాకు పక్షవాతం వచ్చి అంగ వైకల్యానికి గురయ్యాను. మంచానికి పరిమితమయ్యాను. విషయం తెలుసుకున్న వలంటీర్ పల్లం అనురాధ మా ఇంటికి వచ్చారు. నాతో పెన్షన్‌కు దరఖాస్తు చేయించి, మంజూరు అయ్యేలా కృషి చేసింది. ప్రతి నెలా 1వ తేదీన పెన్షన్ ఇచ్చి ఆదుకుంటోంది. వలంటీర్ వ్యవస్థ చాలా బాగుంది.
–ఈర్ల సోమునాయుడు, నడుపూరు

పశు వైద్యశాలకు పక్కా భవనం నిర్మించాలి

అగనంపూడి: అగనంపూడి పశు వైద్యశాలకు పక్కా భవనం నిర్మించాలని అగనంపూడికి చెందిన అఖిల పక్షాల నాయకులు మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. మంత్రి నివాసంలో కలిసిన నాయకులు అగనంపూడి సమస్యలు వివరించారు. శిథిలావస్థలో ఉన్న పశువైద్యశాల భవనాన్ని పునర్నిర్మించాలని, స్థానిక నిర్వాసిత కాలనీల్లో విద్యుత్ సమస్య పరిష్కారానికి సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని, హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో స్థానికులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోకాడ రాము, పిల్లా రవి, రాజశేఖర్, బి.సత్యనారాయణ, శంకరరావు, నిర్మల పాల్గొన్నారు.


మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు పుష్పగుచ్ఛాలు అందిస్తున్న నాయకులు

క్లుప్తంగా

సత్యసాయి పల్లకీ సేవ


పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: సత్యసాయి సేవా సమితి, ఉక్కునగరం ఆధ్వర్యంలో ఆదివారం సత్యసాయి పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. భక్తులు లోక కల్యాణం, విశ్వశాంతి కోసం భజనలు చేశారు. చిన్నారులు, మహిళలు ఉత్సాహంగా కోలాటం ప్రదర్శించారు. అనంతరం భక్తులకు ఫొటో, ప్రసాదం అందజేశారు. సుమారు 200 మంది భక్తులతోపాటు సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

ముగిసిన వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న రోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వెల్‌నెస్ సెంటర్‌లో రెండు రోజుల ఉచిత వైద్య శిబిరం ఆదివారంతో ముగిసింది. లీ హెల్త్ డొమైన్, జేసీఐ, లయన్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన శిబిరంలో అనేక మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు వారికి పలు సూచనలు చేశారు. లీ హెల్త్ డొమైన్ డైరెక్టర్ ఆళ్ల లీలారాణి మాట్లాడుతూ వైద్య శిబిరానికి అనేక మంది హాజరుకావడం సంతృప్తికరమన్నారు. జేసీఐ, లయన్స్ క్లబ్‌లు భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు.

ఐసీడీఎస్ బడ్జెట్ పెంచాలి

గాజువాక : రాష్ట్రంలో అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు తుంపాల శ్రీరామమూర్తి ఒక ప్రకటనలో కోరారు. ఐసీడీఎస్ బడ్జెట్‌ను పెంచాలని, సుప్రీం కోర్టు తీర్పు మేరకు గ్రాట్యుటీ చెల్లించాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్ కింద రూ.5 లక్షలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలపై ఆందోళనకు దిగిన అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడం తగదని, 650 మందిని అరెస్ట్ చేయడం అన్యాయమని పేర్కొన్నారు.

బీమా సొమ్ము అందజేత


లక్ష్మి కుటుంబానికి బీమా సొమ్ము అందిస్తున్న సచివాలయ కన్వీనర్ ప్రసాద్, సిబ్బంది

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు కాపు జగ్గరాజుపేటకు చెందిన మహిళ కోరుకొండ లక్ష్మి ఇటీవల ప్రమాదవశాత్తు మరణించడంతో ఆమె కుటుంబానికి తక్షణ సాయం కింద వైఎస్సార్ బీమా సొమ్ము రూ.10 వేలను ఆదివారం వార్డు సచివాలయ కన్వీనర్ నమ్మి ప్రసాద్, సిబ్బంది అందించారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ బీమా సొమ్ములో మొదటి విడతగా రూ.10 వేలు చెల్లించామని, మిగిలిన మొత్తం మృతిరాలి కుటుంబ సభ్యుల ఖాతాలో జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శి బాలరాజు, నాయకులు ఉరుకూటి అప్పారావు, మాడిశ కృష్ణ, సర్వసిద్ధి వరహాలు తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా తీవ్ర గాయాలైన ఘటన జరిగింది. గాజువాక బీసీ కాలనీకి చెందిన బి.రాము శనివారం రాత్రి బిర్లా కూడలి వైపు నుంచి ఊర్వశి వైపు ఆటోలో వస్తున్నాడు. ఆ క్రమంలో బిర్లా జంక్షన్ దాటాక ఆటో దిగి రోడ్డు దాటుతున్న క్రమంలో బైక్‌పై ఒక్కసారిగా వచ్చిన ఓ వ్యక్తి రాముని ఢీకొనడంతో తీవ్ర గాయాలై రెండు కాళ్లు విరిగిపోయాయి. వెంటనే క్షతగాత్రుడిని సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆదివారం రాత్రి బాధితుడు రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆధార్ నమోదు శిబిరానికి స్పందన

గాజువాక : గాజువాక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత ఆధార్ నమోదు శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ఐదేళ్లలోపు వయస్సు గల 50 మంది చిన్నారులకు ఆధార్ నమోదు చేసినట్టు క్లబ్ అధ్యక్షుడు చిక్కా సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు సత్యాల కోటేశ్వరరావు, సీహెచ్.జగదీష్, బలివాడ సత్యారావు, అచ్యుతరావు, నున్న శ్రీనివాసరావు, బోయిన బాబూరావు, జె.వీరయ్య పాల్గొన్నారు.


చిన్నారులకు ఆధార్ నమోదు చేస్తున్న దృశ్యం

క్రికెట్ టోర్నీ ట్రోఫీ ఆవిష్కరణ

పెదగంట్యాడ: క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పెందుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. జీవీఎంసీ 77వ వార్డు నమ్మిదొడ్డి జంక్షన్‌లో నిర్వహిస్తున్న ఏసీసీ ఐపీఎల్ సీజన్–4 క్రికెట్ టోర్నమెంట్ ట్రోఫీని, క్రీడాకారుల జెర్సీలను, ఆదివారం ఆయన ఆవిష్కరించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తన వంతు సాయం కింద రూ.60 వేలతో జెర్సీలను అదీప్‌రాజ్ అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, నాయకులు శివకుమార్, ఎంపీ రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.


ట్రోఫీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

డాబాగార్డెన్స్ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీ సంఘాల నాయకులతో చర్చించి వారికి న్యాయం చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ అనుబంధ సంస్థ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె. లలిత కోరారు. అసోసియేషన్ విశాఖ, విజయనగరం ఉమ్మడి జిల్లాల సదస్సు ఆదివారం అల్లిపురంలో గల నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు అతి తక్కువ గౌరవ వేతనాలకు పని చేస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు విజయవంతం చేసేందుకు నిత్యం గ్రామీణ, పట్టణ నిరుపేద కుటుంబాలు, గర్భవతులు, బాలింతలకు, సున్నా నుంచి ఆరేళ్ల పిల్లల వరకు సేవలందిస్తున్నారని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ భారమై అప్పులు తెచ్చి కేంద్రాలు నిర్వహించాల్సిన స్థితి ఏర్పడుతుందన్నారు. అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అసోసియేషన్లను ఆహ్వానించి, చర్చించి మంచి వేతనాలు అమలు చేయాలని, ఈఎస్ఐ, పెన్షన్, ఇన్సూరెన్స్ అమలు చేయాలని, విధుల్లో చనిపోయిన వారికి రూ. ఐదు లక్షలు ఇవ్వాలని, వారి ఇంటిలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ విజయనగరం జిల్లా నాయకుడు డేగల అప్పలరాజు, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు బేగం తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న లలిత

రెండు జిల్లాల నూతన కమిటీ..

సమావేశం అనంతరం విశాఖ, విజయనగరం ఉమ్మడి జిల్లాల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశాఖ జిల్లా అధ్యక్షురాలిగా అనిత, ఉపాధ్యక్షురాలిగా వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా అనురాధ, సహాయ కార్యదర్శిగా అరుణ, కోశాధికారిగా నరసయ్యమ్మ, కమిటీ సభ్యులుగా కుమారి, విజయ, కొండమ్మ, సీతను ఎన్నుకున్నారు. విజయనగరం జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఈగల అప్పలరాజు, అధ్యక్షురాలిగా రమణి, ఉపాధ్యక్షురాలిగా మణి, కార్యదర్శిగా మాణిక్యం, సహాయ కార్యదర్శిగా సుశీల, కోశాధికారిగా రమణ, సభ్యులుగా కుమారి, సరోజిని, యశోద, కనకమహాలక్ష్మి, హైమావతి తదితరులను ఎన్నుకున్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కండి

కూర్మన్నపాలెం: ప్రజలందరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని తిరుమలనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. 87వ వార్డులోని మీ సేవా వద్ద గల ఫిష్ మార్కెట్‌లో పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతూ ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించి స్టీల్ బాక్స్‌లు, నార సంచులను ఉపయోగించాలని, ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని కోరారు. తడి చెత్తను కంపోస్ట్ ఎరువుగా మార్చాలని, ఇంకుడు గుంతలను తవ్వి భూగర్భ జలాలను సంరక్షించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా ఎకో వైజాగ్ లక్ష్యాలను సాధించి, రాబోయే స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో విశాఖ నగరానికి మొదటి ర్యాంకు రావటానికి ప్రజలంతా తమ వంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమానందం, పరమేశ్వరరావు, వసంతరెడ్డి, భాస్కరరావు, మూర్తి, కామరాజు, ధర్మరాజు, రమణ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న తిరుమలనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు

సెయిల్‌లో స్టీల్‌ప్లాంట్ విలీనానికి వినతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని ఉక్కు అధికారుల సంఘం(సీ) నాయకులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని కోరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమితులైన ఆమెను విజయవాడలో ఆదివారం సీ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సెయిల్‌లో స్టీల్ ప్లాంట్ విలీనం ఆవశ్యకతను వివరించారు. అదే విధంగా 2017 నుంచి అధికారులకు వేతన ఒప్పందం, పదోన్నతులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీనిపై పురందేశ్వరి మాట్లాడుతూ ఈ అంశాలను కేంద్ర ఉక్కు మంత్రి జ్యోతిరాదిత్య సింధియా దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీ అధ్యక్షుడు కాటం చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.డి.ప్రసాద్, నరసింహ, ఎం.సత్యనారాయణ, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

విశేష అలంకరణలో తిరుమల బాలాజీ



అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్‌టీబీఎల్ ప్రాంగణంలో కొలువైన శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో ఆదివారం రాత్రి విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు బాలాజీ విశేష అలంకరణలో దర్శనమిచ్చాడు.

అసైన్డ్ భూముల విక్రయాలపై ఆంక్షలుండాలి

గాజువాక: అసైన్డ్ భూములకు సంబంధించిన పీవోటీ యాక్టును సడలిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వాటి క్రయ విక్రయాలపై కొన్ని ఆంక్షలను విధించాలని దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు కోరారు. గాజువాకలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులకు ప్రభుత్వం పంపిణీ చేసిన అసైన్డ్ భూముల పరిరక్షణకు పీవోటీ యాక్టు 1977తోపాటు 1/70 యాక్టు రక్షణ కవచాలుగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం వాటిని సడలించి క్రయ విక్రయాలకు అవకాశం కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కొన్ని షరతులను విధించాలని సూచించారు. అసైన్డ్ భూముల క్రయవిక్రయాలు ఆయా సామాజికవర్గాలకు పరిమితం చేసేలా చూడాలని, లేదా.. ఉన్న భూమిలో సగం కంటే ఎక్కువగా అమ్మకుండా ఆంక్షలు పెట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దళిత పారిశ్రామిక విధానానికి ఈ అసైన్డ్ భూములను ఆయా వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు అందించి ఇటు నిరుద్యోగులకు, అటు పట్టాదారునికి తగిన ఆర్థికాభివృద్ధిని కల్పించాలన్నారు. 12 ఏళ్లపాటు సాగులో ఉన్న దళితులకు సదరు భూములపై రిజిస్ట్రేషన్ చార్జీ లేకుండా హక్కును కల్పించాలని కోరారు. సమావేశంలో మహిళా అధ్యక్షురాలు నక్కెళ్ల నాగమణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాల్తేటి పెంటారావు

డబ్బులు డిమాండ్ చేసిన ఇద్దరిపై కేసు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధి భానోజీ తోటలో ఇంటి నిర్మాణం చేపట్టిన ఓ మహిళను బెదిరించి డబ్బులు డిమాండ్ చేసిన ఇద్దరిపై న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. న్యూపోర్టు సీఐ రాము తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భానోజీతోటకు చెందిన కవల గంగవేణి తన స్థలంలో జీవీఎంసీ అనుమతులతో ఇంటి నిర్మాణం చేపట్టింది. రౌడీషీటర్ ఓలేటి నూకరాజు, నకిలీ రిపోర్టర్ మహేష్ ఆమె వద్దకు వెళ్లి రూ.50 వేలు డిమాండ్ చేశారు. అడిగిన డబ్బులు ఇవ్వకపోతే నిర్మాణాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. రూ.50 వేలు ఇవ్వలేనని ఆమె చెప్పడంతో రూ.20వేలు ఇవ్వాలన్నారు. దీంతో బాధితురాలు తన భర్తతో కలిసి న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బెదిరించిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గంగవరం పోర్టు కార్మికులకు న్యాయం చేయాలి

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులకు న్యాయం చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షురాలు పి.మణి డిమాండ్ చేశారు. గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన వద్ద చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షా శిబిరాన్ని సీఐటీయూ నాయకులతో కలిసి ఆదివారం ఆమె సందర్శించారు. నిర్వాసిత కార్మికుల ఆందోళనకు మద్దతు తెలిపారు. అనంతరం మణి మాట్లాడుతూ గంగవరం పోర్టు నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన వారికి అన్యాయం చేయడం సరికాదన్నారు. జీతాలు పెంచమని కోరిన కార్మికులను ఉద్యోగాల నుంచి ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. యాజమాన్యం దిగివచ్చి కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నొల్లి తాతారావు, కొవిరి అప్పలరాజు, వాసుపల్లి ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న మణి

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. 200 మంది రోగులను పరీక్షించగా.. 40 మందిని శస్త్ర చికిత్సల కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో తాటికొండ జగదీష్, శ్రీకాంత్, దుర్గారావు, సురేష్, భాస్కరరావు, పత్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

'ఉక్కు' ప్రైవేటీకరణతో కార్మికుల భవిష్యత్తు అంధకారం

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణతో కార్మికులు, ఉక్కు నిర్వాసితుల భవిష్యత్తు అంధకారంగా మారిందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు ఆదివారంతో 885వ రోజుకు చేరుకున్నాయి. స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొండ తాతన్న, ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకుంటేనే దేశ భవిష్యత్తు బాగుంటుందన్నారు. ఎన్నో ఏళ్లుగా కార్మికులు ఆహోరాత్రులు శ్రమించి స్టీల్‌ప్లాంట్ ఆస్తులను దేశంలో అగ్రగామిగా నిలిపితే, నేడు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయాలని అనుకోవడం దుర్మార్గమైన చర్యన్నారు. కార్మికుల హక్కులు, సదుపాయాలు కొనసాగాలంటే స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగంలోనే కొనసాగాలని, అంతవరకు ఉద్యమిస్తామని చెప్పారు. కార్మికులు పట్టువదలకుండా మరింత ఉధృతం చేసి ప్రజా ఉద్యమంగా మలచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.బొడ్డు పైడిరాజు, ఎస్.రామారావు, ఎస్.సత్యనారాయణ, పరంధామయ్య, పుల్లారావు, లక్ష్మణమూర్తి, ఫణీంద్ర, ఇతర కార్మికులు పాల్గొన్నారు.


885వ రోజు దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న మల్లయ్య